నిందితులను కఠినంగా శిక్షించాలి

కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

కురవి: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కురవి, ఆగస్టు 18: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అమానుషంగా లైంగికదాడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ గంధసిరి జ్యోతిబసు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గుడిసెంటర్‌లో నిందితులను శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఇంకా ఆడపిల్లలపై దాడులు జరుగుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్భయ, పోక్సో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొలిపాక వీరేందర్, నిమ్మశెట్టి మురళి, అనిల్, పూజేశ్, మహిపాల్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

మహబూబాబాద్ రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవిత అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనపై ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని, దేశంలో ఇలాంటి ఘటనలు మళ్లీ జరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం, మైస శ్రీనివాస్, రమేశ్, ఐలయ్య, ఉపేందర్, కార్తీక్ పాల్గొన్నారు. అదేవిధంగా వైద్య విద్యార్థిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి అన్నారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. సభ్యసమాజం తల దించుకునేలా వైద్య విద్యార్థినిపై ఈ ఘటన జరగడం దారుణమన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పూర్తి దర్యాప్తు చేయించాలన్నారు. అజయ్ సారథి, పెరుగు కుమార్, నవీన్, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ భూమి వద్ద ఘర్షణ

మహిళా రైతుపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

సుమతిపై దాడి చేస్తున్న మహిళ

దంతాలపల్లి, ఆగస్టు 18: వ్యవసాయ భూమిలో హద్దురాయి గెట్టు విషయంలో జరిగిన ఘర్షణలో మహిళా రైతుపై దాడి చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన రైతు దీకొండ వీరన్న ఇదే గ్రామానికి చెందిన అల్లి ముత్తయ్యకు చెందిన 10గుంటల భూమిని కొనుగోలు చేశారు. విక్రయించిన సమయంలో ఆ భూమికి దారి ఇచ్చి ఇప్పుడు తమకు దారి లేదని తెలుపడంతో అడిగేందుకు వెళ్లిన వీరన్న, భర్య సుమతిపై ముత్తయ్య, భర్య, కుమారుడు, తమ్ముడు కలిసి తాడుతో కట్టేసి దాడి చేసిన్నట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన్నట్లు బాధితులు వీరన్న, సుమతి తెలిపారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

కేసముద్రం, ఆగస్టు 18: మండల కేంద్రంలోని హరిహర గార్డెన్‌లో లయన్స్ క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి అశోక్, రావుల నవీన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యుడు మదిపెద్ది వెంకటేశ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారని, కార్యక్రమానికి ఎస్సీ సుధీర్‌రాంనాథ్ కేకన్ హాజరవుతారని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

మురళి ఆశయ సాధనకు కృషి చేయాలి

నివాళ్లులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18: అజ్ఞాత దళ కమాండర్ మురళి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మురళి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు చేశారని, అనేక మంది పోడు రైతులకు అండగా నిలిచారన్నారు. పైండ్ల యాకయ్య, వెంకటేశ్వర్లు, వీరన్న, మహేశ్ పాల్గొన్నారు.

కొత్తగూడలో ఇప్పూ ఆధ్వర్యంలో నివాళి..

కొత్తగూడ: మురళి ఆశయ సాధనకు పోరాడుదామని ఇప్పూ ఏరియా కార్యదర్శి పసునూరి రాజమల్లు అన్నారు. మురళి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పాలడుగుల కృష్ణన్న స్మారక భవనంలో ఆయన చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. కాసార్ల లక్ష్మయ్య, పింగిలి యాదయ్య, పర్శ రాములు పాల్గొన్నారు.

కలుపు మొక్కల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కలుపు నివారణపై శ్రద్ధ వహించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 18: పంటల్లో కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జేవీఆర్ ఉద్యాన పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో వయ్యారిభామ కలుపు మొక్కల నివారణ వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయ్యారిభామ కలుపు మొక్కల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని, పంటలు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రతి పంటలో ఈ మొక్కలను గుర్తించి తొలగించి తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శేఖర్, పాషా, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దు : సీఐ

షాపుల యజమానులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

మరిపెడ, ఆగస్టు 18: మున్సిపల్ కేంద్రంలోని మెయిన్ బజార్‌లో షాపుల ఎదుట వాహనాలు నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దని మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ వ్యాపారస్తులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. షాపుల ఎదుట పరిమితికి మించి వాహనాలను నిలపడంతో మెయిన్‌రోడ్డుపై భారీ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశమున్నందున పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపు యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకొని రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చూడాలన్నారు. ఎస్సై సతీశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న పోలీసులు

మరిపెడ, ఆగస్టు 18: మరిపెడ మండలం తానంచర్లలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అశోక్ లేలాండ్ ట్రాలీ వాహనంలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వాహనంలో 30క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటిక గుర్తించి, వాహనాన్ని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'కస్తూర్బా' ఎదుట పేరెంట్స్ నిరసన

- కనీస సౌకర్యాలు లేవని, మెనూ పాటించడం లేదని ఆవేదన
- కలుషితమైన తాగునీటితో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పాఠశాల ఎదుట పేరెంట్స్ ఆందోళన


కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులు తాగే నీటిని చూపుతున్న తల్లిదండ్రులు

పాఠశాలలో ఊడిపోయిన బాత్‌రూం డోర్లు

చిన్నగూడూరు, ఆగస్టు 18: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, తాగేందుకు మినరల్ వాటర్ కూడా ఇవ్వడం లేదని పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. తాగునీరు కలుషితమై విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ పూర్తి స్థాయిలో అమలు కావడంలేదని, విద్యార్థులు నాణ్యత గురించి అడిగితే ఎస్వో లలిత పిల్లలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపించారు. పాఠశాలలో అరకొర వసతులతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని, 190 మంది విద్యార్థులుండగా సరిపోయే బాత్‌రూం, మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్న వాటికి డోర్స్ ఊడిపోయి ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎస్వో జిల్లా కార్యాలయానికి వెళ్తున్నానంటూ అందుబాటులో ఉండకపోవడం, పాఠశాల ఆవరణలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా తమ పిల్లలకు ఒకరోజు సెలవు ఇవ్వమని ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు గేటు వద్ద పడికాపులు కాసినా ఎస్వో స్పందించలేదని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.